
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 19 అక్టోబరు 2025


మానుకోట పట్టణంలో జ్యోతి బాపూలే విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

సకలం బంద్



మహబూబాబాద్‌లో డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు

బయ్యారంలో మూతపడిన షాపులు

రిజర్వేషన్ల కోసం గళమెత్తిన బీసీలు

- మద్దతుగా అన్ని రాజకీయ పార్టీల ర్యాలీలు
- స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసిన వ్యాపారులు
- మధ్యాహ్నం 2 గంటల వరకు కదలని బస్సులు
- మానుకోట తహసీల్ ఆఫీస్ ఎదుట వామపక్షాల సభ

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శని వారం చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైంది. అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలికి బంద్‌లో పాల్గొన్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో బంద్ సక్సెస్ అయింది. స్వచ్ఛందంగా వ్యాపారులు దుకాణాలు మూసి వేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు. పెట్రోల్ బంక్‌లు, సినిమా థియేటర్లు మూసివేశారు. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి బస్సులు ఆరంభమయ్యాయి. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీసీ కులసంఘాల నేతలు బైక్ ర్యాలీలు నిర్వహించి బంద్‌ను విజయవంతం చేశారు. జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్ ఆఫీసు ఎదుట సభను నిర్వహించారు.

- సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, మాస్ లైన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పురవీధుల్లో పర్యటిస్తూ బంద్‌ను పర్యవేక్షించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్ ఆఫీసు వరకు ర్యాలీ చేపట్టి, సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, గౌని ఐలయ్య, పాయం చిన్నచంద్రన్న, బండపల్లి వెంకటేశ్వర్లు, మండల వెంకన్న మాట్లాడారు. బీసీలకు నిజమైన ద్రోహి బీజేపీ అని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ అంశాన్ని 9వ షెడ్యూల్ చేర్చి రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అజయ్‌సారథి రెడ్డి, సూర్నపు సోమయ్య, వెంకటేశ్వర్లు, పెరుగుకుమార్, నవీన్, రాజు, లింగన్న, రాజన్న, వెంకన్న, రాజమౌళి, సీతారాం, రవి, శ్రావణ్, నాగన్న, ఫాతిమా, రాంమూర్తి, రవిచంద్రబోస్ పాల్గొన్నారు.
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టి జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్ పాషా, రామగోని రాజు, ఎడ్ల రమేష్, పోతురాజు రాజు, గుగులోతు వెంకట్‌నాయక్, అజ్మీర సురేష్‌నాయక్, బెల్లంకొండ శ్రీనివాస్, వీరభద్రం, రాజు, విజయలక్ష్మి, బి.స్వర్ణలత, భూక్య లక్ష్మి, నిమ్మల శ్రీనివాస్, యాకూబ్, గోనె శ్యాం, దేవుడు, మాదరబోయిన యాకయ్య, శంకర్ పాల్గొన్నారు.
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు గద్దె రవి, జెరిపోతుల వెంకన్న పాల్గొన్నారు.
- బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, దారా ఇందుభారతి, గడ్డం అశోక్, వెన్నమల్ల అజయ్, రేష్మ, సందీప్, ప్రేమ్‌రాయుడు, బాలు నాయక్, సురేష్ పాల్గొన్నారు.
- ఇస్లాహే మాషిరా ముస్లిం కమిటీ (మిగతా 8వ పేజీలో)


మానుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, మాస్‌లైన్ నేతలు


మానుకోటలో ర్యాలీని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఫిర్యాదులను పరిష్కరించాలి

ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్


కేసముద్రం సీఐ కార్యాలయాన్ని సందర్శించిన సుధీర్‌రాంనాథ్‌కేకన్

కేసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సూచించారు. ఇటీవలె నూతనంగా ఏర్పాటైన కేసముద్రం పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్లతో పాటు కేసముద్రం పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్లలో రికార్డులను, మౌళిక వసతులను పరిశీలించారు. సర్కిల్ కార్యాలయంలో రంగులు వేయించాలని సూచించారు. ఇనుగుర్తిలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం ఎస్సీ హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజలపట్ల మర్యాదతో పోలీసులు వ్యవహరించాలని సూచించారు. ప్రజలను కలిసి పోలీస్ సేవలపట్ల వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు. డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతికిరణ్, కరుణాకర్ ఉన్నారు.


గొల్లచర్ల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం బారులు తీరిన రైతులు

డోర్నకల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : యూరియా కొరత రైతులను వేధిస్తూనే ఉంది. శనివారం డోర్నకల్ పీఏసీఎస్ వద్దయూరియా పంపిణీ చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు ఉదయమే అక్కడకు చేరుకుని బారులు తీరారు. వ్యవసాయశాఖ అధికారులు ఒక్కో రైతుకు ఒక్కోబస్తా చొప్పున యూరియా బస్తాలను అందించారు. రైతులు పెద్ద ఎత్తున అక్కడికి రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారులు రైతుల కోసం మంచినీరు, టెంట్ సౌకర్యం కల్పించారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన మేరకు యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

ముగిసిన మద్యం షాపుల
దరఖాస్తుల స్వీకరణ

- మొత్తం 1,622 పత్రాల దాఖలు
- గతంలో కంటే ఈ సారి తగ్గిన సంఖ్య

నెహ్రూసెంటర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులకు దరఖాస్తుల గడువు ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 61 దుకాణాలకుకు గాను షాపులను దక్కించుకునేందుకు మొత్తం 1,622 దరఖాస్తులు వచ్చినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్ తెలిపారు. శనివారం దరఖాస్తులకు ఆఖరిరోజు గడువు కావడంతో మద్యం షాపులను దక్కించుకోవాలనుకున్న ఆశావహులు భారీగా తరలివచ్చారు. చివరి రోజు ఒక్కరోజే రాత్రి 8 గంటల వరకు 685 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో 2023-25 మద్యం టెండర్ల పాలసీలో జిల్లాలో మొత్తం 2,589 దరఖాస్తులు నమోదయ్యాయి.

గతంతో పోల్చుకుంటే ఈసారి 1622 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని, రాత్రి 11 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మరో 30 నుంచి 50 దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని కిరణ్‌నాయక్ పేర్కొన్నారు.

ప్రేమవిఫలమై..
గడ్డిమందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి
- ఇనుగుర్తి మండలంలో విషాదం


రాజు(ఫైల్)

ఇనుగుర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలమై.. రెండురోజుల క్రితం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గడ్డిమందు తాగడంతో చికిత్స పొందుతూ ఇనుగుర్తికి చెందిన యువకుడు శనివారం మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి ఎస్ఐ జి.కరుణాకర్ తెలిపిన ప్రకారం. ఇనుగుర్తికి చెందిన ఆలకుంట్ల కొమురమల్లు-స్వరూప దంపతులకు కుమారుడు ఆలకుంట్ల రాజు (27), ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రాజు గత కొన్నేళ్లుగా భూపాలపల్లిలో వడ్డెర పని చేస్తు న్నాడు. ఎనిమిదేళ్ల క్రితం భూపాలపల్లికి చెందిన ఓ యువతి (25)ని ప్రేమించాడు. అయితే ఆమె రాజును వివాహం చేసుకునేందుకు తిరస్కరించడంతో, ఈనెల 16న సదరు యువతి ఇంటికి వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు రాజును తొలుత వరంగల్ ఎంజీఎంకు, అక్కడి నుంచి తొర్రూరులోని ప్రైవేటు ఆస్పత్రికి (మిగతా 8వ పేజీలో)

బీసీ బంద్ సంపూర్ణం

● జిల్లా వ్యాప్తంగా మూతపడిన వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు


దంతాలపల్లిలో ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు


పెద్దవంగరలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


తొర్రూరు ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు


దోర్నకల్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తలు


గార్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష, బీసీ సంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌తో శనివారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. అన్ని మండలకేంద్రాల్లో రాజకీయ పార్టీలు, బీసీ కులసంఘాల నేతలు బైక్ ర్యాలీలు నిర్వహించారు.

● మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామశివారులో మానుకోట-కేసముద్రం రహదారిపై సీపీఐ మండల కార్యదర్శి తండా సందీప్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సతీష్, కృష్ణ, గురుస్వామి, వినయ్ పాల్గొన్నారు.

● తొర్రూరులో ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి బంద్ పాటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా భారీర్యాలీ నిర్వహించారు. మంగళంపల్లి శ్రీనివాస్, సీతారాములు, సోమ రాజశేఖర్, కుమార్, రమేష్, యాకయ్య, కొత్తపల్లి రవి, సాయిలు, బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు పెదగాని సోమయ్య, వెంకన్న, శ్రీలత, వనజ పాల్గొన్నారు.

● డోర్నకల్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, న్యూ డెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. మాద శ్రీనివాస్, కోటిలింగం, మల్లం అనిల్, బోడ హరిలాల్, శరత్‌బాబు, విద్యాసాగర్, రాంభద్రం, మల్లేశం, నవాబ్, హరికృష్ణ, భద్రు నాయక్, ఖాదర్‌బాబా, ఎల్లావుల హరికృష్ణ, దారవత్ కృష్ణ పాల్గొన్నారు.

● కురవిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. అంబటి వీరభద్రం, నల్లు సుధాకర్‌రెడ్డి, నల్లపు సుధాకర్, గుజ్జు దేవేందర్, కర్నం రాజన్న, అవిరె మోహన్‌రావు, గంధసిరి శ్రీనివాస్, మలేడి కోటయ్య, సామ పాపయ్య పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గుగులోతు రవినాయక్, కొంతం విజయ్, రాజునాయక్, చిన్నం భాస్కర్, కిన్నెర మల్లయ్య, బాదె నాగయ్య, కాట్యాల వీరన్న పాల్గొన్నారు.

● సీరోలు మండల కేంద్రంలో బంద్‌లో కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్‌నాయక్, గవినె వెంకన్న, కొప్పుల వెంకట్‌రెడ్డి, గండ్ర సత్యం, జెర్రిపోతుల మహేష్, మంగీలాల్, సురేష్, మహేందర్‌రెడ్డి, వీరిశెట్టి ఉపేందర్ పాల్గొన్నారు.

● గార్లలో సీపీఎం, ఎన్డీ, బీఆర్ఎస్, టీడీపీ,బీసీ సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొని ర్యాలీలు నిర్వహించారు. కందునూరి శ్రీనివాస్, కత్తి సత్యంగౌడ్, జి.సక్రు, జడ సత్యనారాయణ, జంపాల వెంకన్న, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, జంపాల విశ్వ పాల్గొన్నారు.

● మరిపెడలో వామపక్ష కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పాటు బీసీ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. విశ్రాంతి భవనం వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అంబరీష, దశరథ్, రాంలాల్, వేణు, తాజోద్దీన్, నర్సయ్య, అలువాల వీరన్న, దుండి వీరన్న, మధుసూదన్, బానాల రాజన్న, గంధసిరి కృష్ణ, రవి, ముఖేష్, దిగిజర్ల శ్రీను, మునేష్, నాగన్న, భూక్య కాంతమ్మ, లింగంనాయక్, గంగాధర్, బింగి రమేష్, హుస్సేన్ పాల్గొన్నారు.

● దంతాలపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద రహదారిపై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేపట్టారు. భట్టు నాయక్, మహేష్‌గౌడ్, కిశోర్‌కుమార్, వీరన్న, రవీందర్ పాల్గొన్నారు.

● పెద్దవంగర అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్, జనసేన నాయకులు వేర్వేరుగా ర్యాలీ నిర్వహించి బంద్‌లో పాల్గొన్నారు. రంగు మురళి, పూర్ణచందర్, వెంకన్న, సంపత్, వేణు, హరికృష్ణ, శ్రీనివాస్, యాకన్న, మహేష్, సాంబి, ఈదురు ఐలయ్య, రాంచంద్రయ్యశర్మ, యాదగిరిరావు, సమ్మయ్య, రఘు, సుధాకర్, అశోక్, సతీష్, దయాకర్, నవీన్, శేఖర్, యాకయ్య, సాయి పాల్గొన్నారు.

● కొత్తగూడలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎన్డీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. వజ్జ సారయ్య, సుంకరబోయిన మొగిలి, బానోత్ రూప్‌సింగ్, చల్లా నారాయణరెడ్డి, కొమ్మనబోయిన వేణు, బానోత్ నెహ్రూ, భూపతి తిరుపతి, పుల్లన్న, శ్రీశైలం పాల్గొన్నారు.

● నెల్లికుదురు అంబేద్కర్ సెంటర్‌లో బీసీ సంఘాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించగా ఆయా పార్టీల నేతలు యాసం రమేష్, పరిపాటి వెంకట్‌రెడ్డి, ఆకుల జగ్గయ్య, వీరగాని మల్లేశం, జి. ప్రభాకర్, వరిపెల్లి ఉప్పలయ్య, నల్లాని నవీన్‌రావు, పట్నంశెట్టి నాగరాజు, చంద్ రాజ్‌కుమార్, ఇస్సంపెల్లి సైదులు, చిర్ర సత్యనారాయణ, అశోద భాస్కర్ పాల్గొన్నారు.

● గంగారంలో కాంగ్రెస్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బంద్ పాటించారు. జున్ను అశోక, గిరగాని ప్రవీణ్, యాప అశోక్, సారయ్య, పుల్లన్న పాల్గొన్నారు.

● కేసముద్రం బంద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, కమ్యూనిస్టు నాయకులు పాల్గొన్నారు. గుగులోత్ దస్రూనాయక్, అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, బండారు వెంకన్న, నీలం దుర్గేష్, కముటం శ్రీనివాస్, గుగులోత్ వీరునాయక్, మోడెం రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

● ఇనుగుర్తి బంద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు కలిసి నిరసన వ్యక్తం చేయడం గమనార్హం. ఆయా పార్టీల నాయకులు కూరెల్లి సతీష్, చిన్నాల కట్టయ్య, గంజి రాజేందర్‌రెడ్డి, బాబురావు, మురళీ, చరణ్, రాము, నారాయణ, అజయ్, ధీకొండ వెంకన్న, పింగిళి శ్రీనివాస్, పుష్పుల వెంకన్న, సలీంరామ్ పాల్గొన్నారు.

● బయ్యారంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీతో పాటు కుల సంఘాల నేతలు బంద్‌కు మద్దతుగా బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు.

● గూడూరులో బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నర్సంపేట-మహబూబాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో, మానవహారం, వంటవార్పు నిర్వహించగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంసీపీఐ (యూ), న్యూ డెమోక్రసీ పార్టీలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో చీర బిక్షపతి, కట్ల విష్ణు, పెదకాసు కుమారస్వామి, ముక్తవరం సత్యనారాయణ, గుర్రం యాకాంబ్రం, పొడిశెట్టి సురేష్, నామాని సదానందం, పుట్ట ఐలయ్య, వల్లెపు శ్రీనివాస్, ఓర్సు బిక్షపతి, నూకల సురేందర్, నూకల ఉపేందర్, చిట్టి వెంకటేశ్వర్లు, చెల్పూరి వెంకన్న, కత్తిస్వామి, మేరెడ్డి సురేందర్ పాల్గొన్నారు.


కొత్తగూడలో నినాదాలు చేస్తున్న పార్టీల నాయకులు


మరిపెడలో రాస్తారోకో నిర్వహిస్తున్న వామపక్ష, కాంగ్రెస్ పార్టీల నేతలు


ఇనుగుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న అన్ని పార్టీల నాయకులు


గూడూరులో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం


బయ్యారంలో బంద్ సందర్భంగా మూతపడిన షాపులు


కురవిలో రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు


నెల్లికుదురులో బీసీ బంద్‌లో పాల్గొన్న ఆయా పార్టీల నాయకులు


కేసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధనార్జనే ధ్యేయంగా ఇసుక రవాణా

● అక్రమంగా ఇసుక డంపులు?

● చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు

మరిపెడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్లతో ఇసుక ఎగుమతి చేస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. పర్యావరణంతో తమకు పని లేదనట్లుగా ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణాను కొనసాగిస్తున్నారు. వేసవిలో భూగర్భజలాలు అడుగంటుతాయనే భయం లేనట్లుగా, ధనార్జనే ధ్యేయంగా భావిస్తున్నారు. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోంది. అయితే ప్రభుత్వ నింబంధనలు పాటించకుండానే నేడు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ప్రధానంగా ఆకేరు, పాలేరు వాగులు ప్రవహిస్తున్నాయి. సదరు వాగుల పరివాహక ప్రాంతంలో ఉన్న చిన్నగూడురు మండల కేంద్రం, ఉగ్గంపల్లి, విస్సంపల్లి, మరిపెడ మండలంలోని తానంచర్ల, తాళ్లపూకల్, ఉల్లేల్లి, బీచ్‌రాజ్‌పల్లి పరిసర ప్రాంతాల రైతుల పంటలకు జీవనధారం, వాగులో ఇసుక ఎక్కువభాగం ఉన్నట్లయితే సమృద్ధిగా నీరు నిల్వ ఉంటే రైతులకు బావులు, బోర్లు, చెరువుల్లోకి భూగర్భజలాలు ఉండి పుష్కలంగా పంటలు పండేవి. ఇసుక రవాణా వల్ల పాలేరు, ఆకేరు వాగుల్లో ఇసుక తగ్గిపోయి చివరకు మట్టి తేలే స్థాయికి చేరుకుంది. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహిస్తుండడం గమనార్హం. పంటలు పండక రైతన్నలు అల్లాడిపోతున్నారు. వాతావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నా ఇసుక రవాణాపై ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాల్సిన బాధ్యత ఉంది.


మూలమర్రి తండా పాలేరు వాగు నుంచి తరలిస్తున్న ఇసుక


మాలోతు తండా (గుట్టకింద తండా) లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపు

అక్రమ ఇసుక ట్రాక్టర్ దొరికితే కఠిన చర్యలు

కృష్ణవేణి, తహసీల్దార్, మరిపెడ

అక్రమ ఇసుక ట్రాక్టర్ దొరికితే కఠిన చర్యలుంటాయి. మండలంలోని, ఉమ్మడి ఉల్లేపల్లి శివారు తండాల్లో అక్రమ ఇసుక డంపులు నిల్వ ఉన్నట్లు సమాచారం ఉంది. ఉమ్మడి తానంచర్ల పరిధిలోని మూలమర్రి తండా వద్ద ఉన్న పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్ దొరికినట్లయితే సుమారు 6 నెలల వరకు రాకుండా చేస్తామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకే అనుమతి ఇవ్వాలి

ప్రభుత్వం నిర్మించే ఇందిరమ్మ గృహాలకే ఇసుక కూపన్లు ఇవ్వాలి. మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికే అధికారులు పర్యవేక్షించి కూపన్లు మంజూరు చేసినట్లయితే ఇసుక రవాణాను కొంత వరకు నిర్మూలించవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇసుక రవాణాను అరికట్టి పంటలను కాపాడాలి. ఇసుక రవాణాపై అధికారులు దృష్టి సారించి, తమ పంటలను నీటి కొరత నుంచి కాపాడాలని ఆకేరు, పాలేరు వాగుల పరిసర ప్రాంత రైతులు వేడుకుంటున్నారు.

మూఢాచారాలను నమ్మొద్దు: ఏఎస్సై

● పోచంపల్లిలో పోలీసుల కళాజాత

పెద్దవంగర, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవొద్దని ఏఎస్సై హిదాయత్ అలీ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పోచంపల్లిలో శుక్రవారం రాత్రి పోలీసుల కళాబృందం మూఢనమ్మకాలు, మంత్రాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై హిదాయత్ అలీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అమాయకులను ఆసరాగా తీసుకొని కొంత మంది దొంగబాబాలు మంత్రాలు, చేతబడుల పేరుతో మోసం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో తిరిగే అనుమానాస్పద వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందిచాలని కోరారు. గ్రామాల్లో వీపీవోలు గస్తీ నిర్వహిస్తారన్నారు. ఫ్రెండ్లీగా మెలుగుతూ నేరస్తులపై ఉక్కుపాదం మోపుదామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు, అక్రమాల వ్యాపారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అన్నారు. ఎవరైనా అనుమానితులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్, డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. నేర ప్రవర్తన కలిగిన వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుధాకర్, హరీశ్, కళాబృందం సభ్యులు సతీష్, తిరుపతి, పృధ్వీరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి


నారాయణ (ఫైల్)

పెద్దవంగర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఏఎస్సై హిదాయత్ అలీ తెలిపారు. శనివారం ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలం చిన్నవంగర గ్రామానికి చెందిన కూన నారాయణ (65) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకు ఉన్న 0.08గుంటల భూమిని ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించాడు. ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ విషయంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. భూ సమస్య, అప్పుల బాధతో తీవ్ర మనస్థాపం చెంది శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరు లేని సమయంలో వ్యవసాయ పనుల కోసం తీసుకొచ్చిన పురుగుల తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి భార్య కూన శశిరేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్‌లు అడ్డుకునేది బీజేపీ

తొర్రూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను అడ్డుకునేది బీజేపీ అని టీపీసీసీ మాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర్ రావు ఆరోపించారు. శనివారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు పెంచడంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడంలేదని, తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదన వచ్చినా పార్లమెంట్‌లో చట్టం చేయకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. బీజేపీ నిజంగా బీసీల పక్షాన ఉంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే బీజేపీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి ఎందుకు తేవడం లేదన్నారు. బీసీలను మోసగించే కుట్ర ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీలకు బుద్ధి చెప్తారన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తొర్రూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో బుచ్చయ్య అన్నారు. శనివారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న భోజనం, గుడ్లు, ఇతర మౌలిక వసతులపై ఆరా తీసి రికార్డులు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం విద్యార్థులు నాణ్యమైన భోజనం అందించడంలేదని ఆందోళన చేసిన నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ప్రతి రోజు గుడ్లు, తాజా కూరగాయలతో భోజనం వడ్డించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెద్దవంగర, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని ఉప్పరగూడెం గ్రామ శివారులో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మస్కు సోమయ్య ద్విచక్రవాహనంపై రోజువారీగా వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. సోమయ్య తన ద్విచక్రవాహనంపై పత్తి బస్తాలను వేసుకొని తిరిగి ఇంటికి వెళ్తుతున్న క్రమంలో ఉప్పరగూడెం నుంచి పెద్దవంగర వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న సోమయ్య తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన సోమయ్యను చికిత్స కోసం తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఈవెంట్లలో విజేతలు..

- **పురుషుల 5వేల మీటర్ల పరుగుపందెంలో :** రషీద్ ప్రథమ(ఉత్తరప్రదేశ్), నిషాంత్ కరహన ద్వితీయ(హరియాణా), సందిప్పల్ తృతీయ(ఉత్తర ప్రదేశ్).
- **మహిళల 5వేల మీటర్ల పరుగుపందెం:** సుప్రీత్‌కచప్ ప్రథమ(జార్ఖండ్), మితాలి రాక్ ద్వితీయ(మహారాష్ట్ర), లతిక్ తల్వార్ తృతీయ(రాజస్థాన్).
- **మహిళల హ్యామర్‌త్రో :** స్నేహ ప్రథమ(హరియాణా), ప్రతిభ ద్వితీయ(మధ్యప్రదేశ్), మిటల్ సోలాంకి తృతీయ (గుజరాత్).
- **పురుషుల జావెలిన్‌త్రో :** ఆనంద్‌సింగ్ ప్రథమ(ఉత్తరప్రదేశ్), ఆదిత్య ద్వితీయ(హరియాణా), పర్ధిక్‌కుమార్ తృతీయ(హరియాణా)
- **మహిళల ట్రిపుల్ జంప్ :** పూర్వ రెష్వంత్ ప్రథమ(మహారాష్ట్ర), పీతి ద్వితీయ(రాజస్థాన్), మేరీ ముక్తసొరెంజ్ తృతీయ(ఒడిశా).
- **మహిళా 400 మీటర్ల హార్డిల్స్ :** హర్శిత ఆర్.ప్రథమ(తమిళనాడు), మౌమిజాన ద్వితీయ(ఎన్‌సీవోఈ పాటియాల), లౌలీ రాజ్‌పుత్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- **పురుషుల 400 మీటర్ల హార్డిల్స్ :** అర్జున్ ప్రదీప్ ప్రథమ(కేరళ), నటరాజ్ ద్వితీయ(తమిళనాడు), హర్దీప్‌కుమార్ తృతీయ(పంజాబ్).
- **మహిళల జావెలిన్‌త్రో :** కుషియాదవ్, ప్రథమ(రాజస్థాన్), సాలోని ద్వితీయ(హరియాణా), ప్రతిక్ష పటేల్ తృతీయ (ఉత్తరప్రదేశ్).
- **పురుషుల ట్రిపుల్ జంప్ :** విషాల్ బహదుర్ ప్రథమ(జార్ఖండ్), ప్రదీప్ ఎకుమార్ ద్వితీయ(ఉత్తరప్రదేశ్), నర్విందర్‌సింగ్ తృతీయ(పంజాబ్).
- **మహిళల 200 మీటర్ల పరుగుపందెం :** సుదిష్ట ప్రథమ(మహారాష్ట్ర), ఆయూషీ ద్వితీయ(ఉత్తరప్రదేశ్), సమృతి జంవాల్ తృతీయ(హిమాచల్‌ప్రదేశ్).
- **పురుషుల 200 మీటర్ల పరుగుపందెం :** డొండపతి ప్రథమ(ఒడిశా), రాజబాబు ద్వితీయ(హరియాణా), ప్రతిక్ డి.తృతీయ(కర్ణాటక).
- **పురుషుల 800 మీటర్ల పరుగుపందెం :** సోమనాథ్ చాహన్ ప్రథమ (హరియాణా), ప్రత్మేష్ ద్వితీయ(మహారాష్ట్ర), షకీల్ తృతీయ(రాజస్థాన్).
- **మహిళల 800 మీటర్ల పరుగుపందెం :** లక్ష్మీతాద్ ప్రథమ(గుజరాత్)ప్రీతియాదవ్‌ద్వితీయ(మధ్యప్రదేశ్)ప్రతిక్షాయాదవ్‌తృతీయ(జేఎస్‌డబ్ల్యూ).
- **మహిళా హెప్టాథ్లాన్ :** కుషి ప్రథమ(బీఎస్ఎఫ్), నిక్షి కుమారి ద్వితీయ(బిహార్), ఇషా చందర్‌పార్క్ తృతీయ (ఉత్తరాఖండ్).
- **పురుషుల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్ :** రాహుల్ ప్రథమ(హరియాణా), నవ్‌రతన్ ద్వితీయ(హరియాణా), రణ్‌వీర్ ఏటీఆర్ సింగ్ తృతీయ (గుజరాత్).
- **మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ చేజ్ :** ప్రచిదేవ్‌కర్ ప్రథమ(మహారాష్ట్ర), సుష్మిత టిగ్గ ద్వితీయ(ఒడిశా), మంజుచౌదరి తృతీయ(రాజస్థాన్).

ముగిసిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో అరుణ్‌దీప్ మీట్ రికార్డు
- మహిళా హ్యామర్‌త్రోలో స్నేహకు స్వర్ణం
- పోటీల నిర్వహణ సక్సెస్



మహిళల ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లోని సింథటిక్ ట్రాక్‌పై నిర్వహించిన 5వ జాతీయస్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన ఒలంపియన్లు, అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లు, అనేక అంశాల్లో పోటీ పడుతూ పతకాలే లక్ష్యంగా చెమటోడ్చారు. హోరాహోరీగా తలపడి పాత రికార్డులను బద్దలు కొట్టారు. కొత్త రికార్డులను నమోదు చేశారు. చివరి రోజు మరో కొత్త రికార్డు నమోదైంది. పురుషుల 400 మీటర్ల హార్డిల్స్‌లో కేరళకు చెందిన అరుణ్ దీప్ ఫైనల్‌లో 50.29 సెకండ్లతో కొత్త రికార్డు సృష్టించారు. అంతకుముందు బిలాస్‌పూర్‌కు చెందిన పి.యషస్(కర్ణాటక) పేరు మీదున్న 50.89 సెకండ్ల పాత రికార్డును అరుణ్‌దీప్ ఛేదించి ఈ కొత్త రికార్డు నెలకొల్పాడు. దీనితో ఈ జాతీయస్థాయి పోటీల్లో మొత్తం ఆరు కొత్తరికార్డులు నమోదైనట్లయింది.



పురుషుల 800 మీటర్ల పరుగు పందెంలో విజేతలకు మెడల్స్ అందజేస్తున్న నిర్వాహకులు, అతిథులు



మహిళా హ్యామర్‌త్రోలో స్వర్ణ పతకం సాధించిన హరియాణా అథ్లెట్ స్నేహ

నిరాశ మిగిల్చిన తెలుగు అథ్లెట్లు

మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి 21, ఆంధ్రప్రదేశ్ నుంచి 6గురు మొత్తం 27 మంది అథ్లెట్లు ప్రాతినిథ్యం వహించినా.. ఒక్క మెడల్స్ సాధించకపోవడంతో క్రీడాభిమానులు, క్రీడాపోషకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) సహకారంతో తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాలతో సహా మొత్తం 938 అథ్లెట్లు ఎంపిక కాగా, ఇందులో 55 మంది హాజరు కాకపోవడంతో 883 మంది అథ్లెట్లు 21 ఈవెంట్లలో తలపడి తమ ప్రతిభను చాటుకున్నారు.

విజయవంతంగా నిర్వహించాం..

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఓపెన్ అండర్-23 మెన్ అండ్ ఉమెన్ 100, 200, 400, 800, 1500, 5వేలు, 10వేల మీటర్ల పరుగు పందెంతో పాటు 20 కిలోమీటర్ల రేస్‌వాక్, 110, 400 మీటర్ల హార్డిల్స్ 3వేల మీటర్ల స్టీపుల్‌చేస్, హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, పోల్ వాల్ట్, షాట్‌పుట్, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, డెకాథ్లాన్, హెప్టథ్లాన్, క్రీడాంశాల్లో మూడు రోజుల పాటు క్రీడలు పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు. ఈ పోటీల్లో 883 మంది అథ్లెట్లు, 135 మంది టెక్నికల్ అఫిషియల్స్, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. చివరి రోజున పోటీల నిర్వహణలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్లీ జోన్, హనుమకొండ డీవైఎస్‌వో అశోక్‌కుమార్, సీఐలు సార్ల రాజు, పుల్యాల కిషన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, పింగిలి రమేష్‌రెడ్డి, రంగాపురం రమణ, ఊర యుగేందర్‌రెడ్డి, రామప్ప పోలీస్ అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్, డీఎస్ఏ కోచ్ శ్రీమాన్, టెక్నికల్ అఫిషియల్స్ గంగిశెట్టి మనోజ్, వాసుదేవ్, సురేష్, రజినీకాంత్, దిమ్మిక నాగరాజు, వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ బాధ్యులు, టీం మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లు బాగున్నాయి

- ఇండియా టీమ్ చీఫ్ కోచ్ రాధాక్రిష్ణన్



హనుమకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మన క్రీడాకారులు ప్రతిభావంతులని, ఇటీవల కాలంలో వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో వారు రాణిస్తున్న తీరే నిదర్శనమని అథ్లెటిక్స్ ఇండియన్ టీం చీఫ్ కోచ్ రాధాక్రిష్ణన్ అన్నారు. హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరుగుతున్న 5వ జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్-23 పోటీలను పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు. జేఎన్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న జాతీయ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. పోటీలను పర్యవేక్షిస్తున్న టెక్నికల్ అఫిషియల్స్‌కు, కోచ్‌లకు, ఇతర పర్యవేక్షకులకు బస, భోజన వసతి, ఇతరత్రా సౌకర్యాల కల్పనను ఆయన మెచ్చుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న అథ్లెటిక్స్‌కు వసతి, బస సౌకర్యాలు కల్పించకపోవడానికి నిధుల కొరతే కారణమన్నారు. జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ అండర్-23 పోటీలు వరంగల్‌లో జరగడం తెలంగాణకే గర్వకారణమన్నారు. ఈ పోటీల ప్రత్యక్ష ప్రసారంతో ప్రదానంగా వరంగల్‌కు దేశ వ్యాప్తంగా మంచి పేరు వస్తుందన్నారు. గతంలో 2022లో సింథటిక్ ట్రాక్ లేనప్పుడే ఇక్కడ నేషనల్స్ విజయవంతంగా జరిగాయని, ఇప్పుడు సింథటిక్ ట్రాక్ ఏర్పాటైన తర్వాత మొదటి సారి ఈ పోటీలు మరింత సమర్థవంతంగా సాగుతున్నాయని చెప్పారు.



జేఎన్ఎస్‌లో స్టీపుల్ చేజ్‌లో మహిళా అథ్లెట్లు



ట్రిపుల్ జంప్ చేస్తున్న మహిళా అథ్లెట్



హార్డిల్స్ పోటీల్లో పాల్గొన్న అథ్లెట్లు



స్టీపుల్ చేజ్‌లో పాల్గొన్న అథ్లెట్లు



జావెలిన్‌త్రోలో..

కాంగ్రెస్, బీజేపీ బీసీ ద్రోహుల పార్టీలు

- పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలి..
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే వరకు పోరాటమే..
- శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



హనుమకొండ బస్టాండ్‌లో బీఆర్ఎస్ నేతలతో ధర్నా చేస్తున్న సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నాయని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మధుసూదనాచారి పాల్గొని మాట్లాడారు. పోరాటాల ద్వారానే బీసీలు తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి బీసీ సమాజాన్ని మోసం చేసిందని విమర్శించారు. బీసీల రాజ్యాధికారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల కోసం 9వ షెడ్యూల్ ద్వారా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపల్లి శోభన్‌బాబు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు పోలెపల్లి రాంమూర్తి, దాడి మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గర్జించిన బీసీలు

- బీసీ బంద్ విజయవంతం
- వరంగల్, హనుమకొండ జిల్లాల వ్యాప్తంగా ర్యాలీలు
- జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు
- బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు, ప్రజా సంఘాలు

హనుమకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి శనివారం నిర్వహించిన తెలంగాణ బీసీ బంద్ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రజలు, వివిధ ప్రజాసంఘాలు, జాతీయ, ప్రాంతీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, మేధావులు, యువకులు, కార్మిక, కర్షక వర్గాలు, ఉద్యోగులు, న్యాయవాదులు అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు. బంద్‌ను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. పాఠశాలలు బంద్ పాటించాయి. పెట్రోల్ బంక్‌లు పని చేయలేదు. ఆటో డ్రైవర్లు సైతం బంద్‌లో పాలు పంచుకున్నారు. బంద్ ప్రభావం స్పష్టంగా కనిపించింది.

బీసీ జేఏసీ బంద్ పిలుపులో భాగంగా బీసీ జేఏసీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నేతలు, బీసీ విద్యార్థి సంఘం, బీసీ యువజన సంఘం నాయకులు, కాంగ్రెస్ బీఆర్ఎస్, కమ్యూనిస్టు, ప్రజా సంఘాల నేతలు ఉదయం 4గంటలకే రోడ్లపైకి వచ్చారు. బస్ డిపోల వద్ద ధర్నా నిర్వహించారు. డిపోల నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డగించారు. హనుమకొండ బస్‌స్టేషన్ ప్రధాన గేట్ వద్ద బైటాయించి బస్సులను అడ్డుకున్నారు. హనుమకొండ, వరంగల్, కాజీపేట పట్టణాల్లోని విద్యా సంస్థలు, వాణిజ్య, వ్యాపార సంస్థలను, సినిమా థియేటర్లను, పెట్రోల్ బంక్‌లను స్వచ్ఛందంగా బంద్ చేయించారు. వరంగల్ బస్టాండ్ వద్ద కూడా బస్సులు రాకుండా అడ్డుపడ్డారు.



బంద్ సందర్భంగా వరంగల్-1, 2 డిపోల్లో నిలిచిపోయిన బస్సులు

హనుమకొండ జిల్లాలో..

బంద్‌లో భాగంగా కేయూ జంక్షన్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి నయీంనగర్, నక్కలగుట్ట, హనుమకొండ చౌరస్తా మీదుగా భారీ బైక్ ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తానే స్వయంగా బైక్ నడుపుతూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మెన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నేతృత్వంలో సాగిన ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. బీసీలకు వారి జనాభా దామాష ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి సైతం బంద్‌లో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చేంద వరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించదన్నారు. మేయర్ సుధారాణి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనన్నారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు కావలసిందేన్నారు. బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకవాలంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చించి బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు.

ములుగు రోడ్డు జంక్షన్‌కు చేరిన అనంతరం అక్కడి కూడలిలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు బైరి రవిక్రిష్ణగౌడ్, ఈవీ శ్రీనివాస్ రావు, దొడ్డపల్లి రఘుపతి, దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, తుమ్మల శోభారాణి, చిర్ర రాజు, తాళ్లపల్లి సురేష్, వైద్యం రాజు గోపాల్, బీమగాని యాదగిరి, తడక సుమన్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలోని అమరవీరుల స్తూపం వద్ద మాట్లాడుతున్న ఓబీసీ చైర్మన్ సుందర్‌రాజు యాదవ్

ఓబీసీ చైర్మన్ సుందర్ రాజు యాదవ్ నేతృత్వంలో మరో ర్యాలీ హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ నుంచి సుబేదారిలోని అమరవీరుల స్థూపం వరకు సాగింది. పలు బీసీ సంఘాల నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద ర్యాలీని ఉద్దేశించి సుందర్‌రాజు యాదవ్ మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లను వారి జనాభా ప్రకారం అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన సాగిస్తామన్నారు. హనుమకొండ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో బీసీ జేఏసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. నడికుడ మండలంలో జరిగిన బంద్‌లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. హసన్‌పర్తిలో బీసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. పరకాలలో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఎల్కతుర్తి, ధర్మసాగర్, బీమదేవరపల్లి, దామెర, శాయంపేట, కమలాపూర్ మండలాల్లో బంద్ ప్రశాంతంగా జరిగింది.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో బీసీ బంద్ సంపూర్ణంగా జరిగింది. బస్సులు నడవకపోవడంతో వరంగల్ బస్టాండ్ నిర్మానుష్యంగా కనిపించింది. హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లో సీపీఐ నాయకులు దుకాణాలను దగ్గరుండి మూయించారు. వరంగల్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు దుకాణాలను మూసి వేయించారు. దుకాణాల మూతతో నిత్యం రద్దీగా ఉండే వరంగల్ మండి బజార్ ప్రాంతం బోసిపోయి కనిపించింది. పోచమ్మమైదాన్ సెంటర్‌లో మన్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పర్వతగిరి మండలకేంద్రంలో బీసీ అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా, బైక్ ర్యాలీ జరిపారు. పోచమ్మమైదాన్ నుంచి కాంగ్రెస్, వరంగల్ స్టేషన్ నుంచి బీజేపీ, హెడ్‌పోస్టాఫీసు నుంచి ఎంసీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీలు సాగాయి. నర్సంపేట పట్టణంలో కూడా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

కేయూలో మార్కుల కలకలం

- అభ్యంతరాలను వ్యక్తం చేసిన విద్యార్థి నాయకులు
- సోషియాలజీ విభాగంలో మార్కుల షీట్ల పరిశీలన
- ప్రొఫెసర్లతో వాగ్వాదం.. 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



మార్కుల షీట్లను చూస్తున్న విద్యార్థి నేతలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో విద్యార్థుల సెమినార్ మార్కుల అంశం రగడ రేపుతోంది. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'చెత్త శుభ్రం చేస్తే ఎగ్జామ్‌లో పాస్' కథనంపై విద్యార్థి సంఘాల నేతలు స్పందించారు. కేయూ క్యాంపస్‌లోని సోషియాలజీ విభాగంలో నాలుగో సెమిస్టర్‌లో భాగమైన విద్యార్థుల సెమినార్‌కు కేటాయించిన మార్కుల షీట్లను శనివారం సాయంత్రం పరిశీలించారు. సోషియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.స్వర్ణలత, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ కుంట అయిలయ్యలతో విద్యార్థుల సెమినార్ మార్కుల షీట్లలో తేడాలు ఎందుకు ఉన్నాయంటూ ప్రశ్నించారు. కాన్ఫిడెన్షియల్‌గా ఉండే మార్కుల షీట్లను ఫొటోలు తీసుకోవద్దంటూ అధ్యాపకులు అభ్యంతరాలు చెప్పబోగా విద్యార్థులు ఎందుకు అంటూ వారితో వాగ్వాదానికి దిగారు. అయితే విభాగాధిపతి సంతకంతో చేసిన మార్కుల షీట్‌తో పాటు అదనంగా మరో మార్కుల షీట్ ఎందుకు ఉందని విద్యార్థులు ప్రశ్నించారు. రెండుమార్కుల షీట్ల పత్రాల్లో విద్యార్థులకు సెమినార్‌కు కేటాయించిన మార్కుల్లో స్వల్పంగా వ్యత్యాసాలున్నాయని విద్యార్థులు ఆరోపించారు.

ఇదిలా ఉండగా, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ శనివారం ఉదయం సోషియాలజీ విభాగాన్ని సందర్శించారు. కథనంలో వచ్చిన అంశాల ఆధారంగా విద్యార్థులకు కేటాయించిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సెమినార్ మార్కుల్లో తేడాలున్నాయా? అంటూ విభాగాధిపతితో పాటు ఇతర అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అయితే శనివారం బీసీ జేఏసీ బంద్ నేపథ్యంలో వర్సిటీలో బంద్‌ను పురస్కరించుకుని పూర్తి వివరాలను అందకుండానే వెనుతిరిగినట్లు సమాచారం. దీపావళి సెలవు తర్వాత మళ్లీ వచ్చి వివరాలన్ని సేకరిస్తానని అన్నట్లు సమాచారం. కాగా ఆరు నెలల కిందట సోషియాలజీ విభాగం రెండో ఏడాది నాలుగో సెమిస్టర్ సెమినార్ మార్కుల కేటాయింపు జరుగగా ఇప్పుడు తాజా వివాదం జరుగుతుంటంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. అయితే విద్యార్థులెవ్వరూ నాలుగో సెమిస్టర్ సెమినార్‌కు సంబంధించిన అంశంలో ఫెయిల్ కాలేదని, అందరికీ మార్కులు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వివరణ ఇవ్వాలని కేయూ ఉన్నతాధికారులు విభాగాధిపతిని ఆదేశించినట్లు తెలుస్తోంది.

దివ్వెల సందడి షురూ..

19న భోగి, 20న దీపావళి, 21న కేదారేశ్వర వ్రతాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటిల్లిపాదినీ అలరించే దివ్వెల పండుగ రానే వచ్చింది. ఈ నెల 19 నుంచి భోగి పండుగతో ప్రారంభమయ్యే వేడుకలు 21న నోములతో ముగుస్తాయి. 20న దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు. దివ్వెల పండుగ వచ్చిందంటే ఇళ్లల్లో సందడి కనిపిస్తుంది. భోగి స్నానాలతో ప్రారంభమై కేదారీశ్వర వ్రతాలు నోములు ఎత్తుకునే వరకు వేడుకలు జోరుగా సాగుతాయి. దీపావళి పండుగను పురస్కరించుకొని పూల దుకాణాలు, నోము సామానులు, టపాకాయల దుకాణాల్లో అమ్మకాలు మొదలయ్యాయి. శుక్రవారం సాయంత్రం నుంచే సందడి మొదలైంది. లక్ష్మి రోజు కావడంతో నోము సామానులు దీప ప్రమిదల కొనుగోళ్లు ప్రారంభించారు.



నోము సామాను విక్రయిస్తున్న దృశ్యం

మహిళపై చేయిచేసుకున్న బీసీ నేతలు

- బాధిత మహిళ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కావడంతో ఉద్రిక్తత
- బీసీ నేతలను బాధిత కుటుంబీకులతో కలిసి నిలదీస్తున్న బీజేపీ శ్రేణులు



చేయి చేసుకున్న బీసీ నేతలను నిలదీస్తున్న బాధిత మహిళ మంగమ్మ

మరిపెడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళపై బీసీ నేతలు చేయిచేసుకున్న సంఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత మహిళ భూక్యా మంగమ్మ బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కావడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. సకాలంలో మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సై కోటేశ్వర్‌రావు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఘర్షణ వాతావరణాన్ని శాంతపరిచారు. ఆ మహిళ బీజేపీ శ్రేణులతో కలిసి మరిపెడ ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ దగ్గర రాస్తారోకో చేస్తున్న బీసీ నేతలను పోలీసుల ఎదుటే నిలదీశారు. పోలీసులు బాధిత కుటుంబ సభ్యులను, బీజేపీ శ్రేణులను అక్కడి నుంచి బయటకు పంపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ బస్టాండ్ కాంప్లెక్స్‌లో కంగన్‌హాల్ తెరిచి ఉంచగా, 42శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బీసీ నేతలు బంద్ నిర్వహిస్తున్నారు. బస్టాండ్ సెంటర్లో కంగన్‌హాల్ తెరిచి ఉండగా అక్కడికి వెళ్లి షాపు బంద్ చేయాలని వారు హల్‌చల్ చేశారు. దీంతో ఆ షాపు నిర్వాహకులు బంద్ చేయడానికి సామానులు సర్దుతుండగా మంగమ్మ భర్త లింగంనాయక్ చెంపపై బీసీ నేతలు కొట్టడంతో మంగమ్మ షాపు బంద్‌చేస్తూనే ఉన్నాం కాదా? ఎందుకు కొడుతున్నారని వాగ్వివాదానికి దిగింది. దీంతో బీసీ నేతలు ఆమెపై చేయిచేసుకొన్నారు. ఆమె చేతికి, వీపుపై దెబ్బలు తగిలాయి. ఈ ఘటనపై మంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై విచారణ జరుపుతున్నట్లు మరిపెడ అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.

ట్రేడ్ లైసెన్సుల ట్రెండ్

కేసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీలో ట్రేడ్‌లైసెన్సుల ట్రెండ్ కొనసాగుతోంది. కొత్తగా ఏర్పడిన మునిసిపాలిటీలో ప్రతీ వ్యాపారసంస్థను సర్వే నిర్వహించి ట్రేడ్‌లైసెన్సు(వ్యాపార అనుమతి పత్రం)ను తప్పనిసరిగా తీసుకోవాలని యజమానులకు మునిసిపాలిటీ అధికారులు, సిబ్బంది సూచిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 25న కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజి, అమినాపురం, ధన్నసరి, ఎస్టీకాలనీ (సబ్‌స్టేషన్‌తండా) గ్రామపంచాయతీల విలీనంతో నూతనంగా కేసముద్రం మునిసిపాలిటీ ఏర్పాటు చేసిన విషయం విధితమే. ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీలుగా ఉన్న సమయంలో ట్రేడ్‌లైసెన్సుల జారీపై పంచాయతీ అధికారులు దృష్టిసారించలేదు. బ్యాంకు, ఇతర రుణాల కోసం ట్రేడ్‌లైసెన్సు అవసరమైన వారు మాత్రమే గ్రామపంచాయతీకి దరఖాస్తు చేసుకొని ఈ లైసెన్సును తీసుకునే వారు. మిగతా వారు ఈ లైసెన్సును పెద్దగా పట్టించుకోలేదు. అయితే మునిసిపాలిటీ ఏర్పాటైన తర్వాత ట్రేడ్‌లైసెన్సులపై మునిసిపాలిటీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. ప్రతీ వ్యాపారసంస్థ మునిసిపాలిటీ నుంచి ట్రేడ్‌లైసెన్సును తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకు సిబ్బంది ఆయా వ్యాపారసంస్థల వద్దకు వెళ్లి వారి షాపు పొడవు, వెడల్పు కొలత వేసి ఎన్ని చదరపు అడుగుల వైశాల్యం ఉందో తెలిపి లైసెన్సుకు ఆన్‌లైన్ లేదా మునిసిపాలిటీలో దరఖాస్తు చేసుకోవాలని యజమానులకు చెబుతున్నారు.



కేసముద్రం స్టేషన్‌లో ట్రేడ్‌లైసెన్సు కోసం షాపు కొలత వేస్తున్న మునిసిపాలిటీ సిబ్బంది

ఏమిటీ.. ట్రేడ్ లైసెన్సు?

గ్రామపంచాయతీ, మునిసిపాలిటీ పరిధిలో నిర్వహించే ఏ వ్యాపార సంస్థ అయినా చట్టబద్ధంగా నడపడానికి స్థానిక సంస్థ జారీచేసే పత్రాన్ని 'ట్రేడ్ లైసెన్సు' (వ్యాపార అనుమతి పత్రం) అంటారు. వ్యాపార కార్యకలాపాలను సమాజానికి హాని కలిగించనివని నిర్ధారించుకునేందుకు ప్రభుత్వం స్థానిక సంస్థల ద్వారా ఈ లైసెన్సును తప్పనిసరి చేసింది. ఒక ఆర్థిక సంవత్సర కాలవ్యవధికి జారీచేసే ఈ లైసెన్సు ఉన్న వ్యాపారం చట్టబద్ధంగా కొనసాగుతున్నట్లుగా గుర్తింపు పొందుతుంది. ఈ లైసెన్సు ఉండడంవల్ల వ్యాపార సంస్థపై వినియోగదారుల్లో నమ్మకం పెరుగుతుంది. ప్రభుత్వ పథకాలు, రుణాలు, రాయితీలు పొందేందుకు ఈ ట్రేడ్‌లైసెన్సు యజమానులకు తప్పనిసరి అవసరం ఉంటుంది. మునిసిపాలిటీ, గ్రామపంచాయతీ వారు జరిమానాలు, షాపునకు తాళాలు వేయడం వంటి సమస్యల నుంచి ట్రేడ్‌లైసెన్సు రక్షణ లభిస్తుంది. ఈ లైసెన్సు జారీ ద్వారా వచ్చే ఫీజు డబ్బులను మునిసిపాలిటీ, గ్రామపంచాయతీల్లో నిర్వహణ ఖర్చులకు ఉపయోగిస్తారు.

600ల షాపులకు లైసెన్సులు తీసుకున్నవి 60..

కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలో సుమారు 600 వ్యాపార సంస్థలు ఉండగా వీటిలో ఇప్పటి వరకు 60 షాపులే ట్రేడ్‌లైసెన్సులు తీసుకున్నవి ఉన్నాయి. మునిసిపాలిటీ ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటి వరకు 480 వ్యాపారసంస్థలకు సిబ్బంది క్షేత్ర సర్వే నిర్వహించి కొలతలు తీసుకుని నమోదు చేసుకున్నారు. వ్యాపారసంస్థ పొడవు, వెడల్పు కొలత వేసి చదరపు అడుగుకు వ్యాపార రకం, ప్రాంతం ఆధారంగా రూ.3 నుంచి రూ.7ల చొప్పున ఫీజును లెక్కించి, ఆన్‌లైన్‌లో లేదా మునిసిపాలిటీ వారికి దరఖాస్తు చేసుకుంటే ఈ లైసెన్సును జారీ చేస్తారు. ఇదిలా ఉండగా మునిసిపాలిటీ పరిధిలోని ఐదు గ్రామాల్లో ఇళ్లలోకి ఏర్పాటు చేసుకున్న వ్యక్తిగత నల్లాలపై సర్వే నిర్వహించగా 5వేల నల్లాలు లెక్కలోకి వచ్చాయి. ఒక్కో నల్లాకు ఏడాదికి రూ.1200 చొప్పున మునిసిపాలిటీకి ఫీజు చెల్లించాల్సిఉంటుంది. వీధిలైట్లు మార్చేందుకు కూడా డబ్బులు లేక నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న కొత్త మునిసిపాలిటీలో ట్రేడ్‌లైసెన్సులు, నల్లాల ఫీజుల ద్వారా ఆదాయాన్ని రాబట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.



కేసముద్రం మునిసిపాలిటీ భవనం

మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి



నూర్ మహమ్మద్ (ఫైల్)

నెల్లికుదురు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని వృద్ధుడు పొలంలో పడి మృతి చెందిన ఘటన నైనాల గ్రామంలో జరిగింది. ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు కథనం ప్రకారం. మహమ్మద్ నూర్ మహమ్మద్ (80) గత కొద్ది రోజులుగా మతిస్థిమితంలేక పోవడంతో ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకి తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు అదేరోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం గ్రామస్థులు గ్రామశివారు తన పొలంలో చూడగా బురదలో పడి శవమై కనిపించాడు. మృతుడి మనుమడు మహమ్మద్ అఫ్సర్ పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నాడు.

ఆర్యూబీ వద్ద మరమ్మతు పనులు



ఆర్యూబీ వద్ద పైపులైన్ మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జీ (ఆర్యూబీ) వద్ద మునిసిపల్ సిబ్బంది పగిలిన డ్రైనేజీ పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. ఆర్యూబీ వద్ద డ్రైనేజీ పైపుపగిలి మురుగు నీరంతా ఆర్యూబీ వద్దకు చేరడంతో పాత, కొత్త బజారులకు రాకపోకలు సాగించే పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సీపీఐ, బీజేపీ పార్టీలు ఆర్యూబీ వద్ద ఆందోళనలు చేపట్టి మునిసిపాలిటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. తాజాగా శనివారం మునిసిపల్ డీఈ ఉపేందర్ నేతృత్వంలో సిబ్బంది ఆర్యూబీ వద్ద పైపులైన్‌కు మరమ్మతులు చేయించి మురుగునీటిని తొలగించి సమస్యను పరిష్కరించారు.

ట్రస్మా జోన్ కమిటీ ఎన్నిక

కేసముద్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) కేసముద్రం, ఇనుగుర్తి, గూడూరు, నెల్లికుదురు మండలాల జోన్ కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర యాకాంతంగౌడ్ తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లిలో శుక్రవారం రాత్రి నిర్వహించిన జోనల్ సమావేశంలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పరపల్లి లాల్‌బహదూర్ స్కూల్ కరస్పాండెంట్ జోగు డాంగయ్య, ప్రధాన కార్యదర్శిగా చిన్నాల కట్టయ్య, కోశాధికారిగా మేకల యాకయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు రాయిలి కోటేశ్వర్‌రావు, పింగిళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు మృతి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలోని కృష్ణకాలనీలో తెలంగాణ ఉద్యమకారుడు, జానపద కళాకారుడు భూక్య సత్యనారాయణ (60) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న నాటి తెలంగాణ ఉద్యమ జేఏసీ కోకన్వీనర్, జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, పి.సదానందం, దార్ల శివరాజ్, ఇరుగు మనోజ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకులు మంగీలాల్ పట్టణంలోని కృష్ణ కాలనీకి చేరుకుని భూక్య సత్యనారాయణ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సత్యనారాయణ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

నున్న నారాయణ ఆశయాలను సాధిద్దాం



డోర్నకల్‌లో నున్న నారాయణ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సీపీఎం నాయకులు

డోర్నకల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పేదల అభ్యున్నతి కొరకు, రైతు కూలీల సంఘటితానికి, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం, స్థానిక సమస్యలపై యువకులను చైతన్యం చేసి ఎన్నో పోరాటాలు నిర్వహించిన నున్న నారాయణ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీపీఎం డోర్నకల్ మండల కార్యదర్శి ఉప్పునపల్లి శ్రీనివాస్ అన్నారు. నున్న నారాయణ 9వ వర్ధంతి సభను డోర్నకల్ సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గంలో సీపీఎం పార్టీ పటిష్టతకు నున్న నారాయణ నిస్వార్థంగా పనిచేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎండీ నవాబ్, వెంకన్న, మల్లేశం, అశోక్, గాదె నాగేశ్వర్‌రావు, మేకపోతుల అంజయ్య, మాచర్ల సైదులు, దాసరి నాగేశ్వర్‌రావు, నున్న చంద్రం, పుట్ట శ్రీనివాస్, జేవీఆర్ పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



సూదనపల్లి పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కురవి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేసి దీపాలను వెలిగించి బాణాసంచాను కాల్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి.వెంకన్న, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్, బాలరాజు, అంజాద్‌పాషా, సారంగం, సరోజ పాల్గొన్నారు.



కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ, మునిసిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న, మునిసపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాంపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో శనివారం కమిషనర్ టి. రాజేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు తక్కువ వేతనంలో అనేక ఏళ్లుగా పని చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, మనోహర్, సైదులు, పుష్పరాజ్, జగన్, శ్రీకాంత్, జానీ, పద్మ, వీరన్న, వెంకన్న, రాము, ముత్తమ్మ, రజినికుమార్, విజయ్, అశోక్, శ్రీను, శ్రీధర్, కృష్ణ, స్వరూప పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు

బయ్యారం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం బయ్యారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని పీఏసీఎస్ ప్రత్యేక అధికారి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా మొక్కజొన్నలకు ప్రభుత్వం రూ. 2400 మద్దతు ధర ప్రకటించినట్లు పేర్కొన్నారు. రైతులెవ్వరు దళారులను ఆశ్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకరావాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ మక్కలను ఎండబెట్టి, శుభ్రపరిచి కేంద్రానికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యనిర్వాహణాధికారి సురేందర్, సిబ్బంది రాజేష్, అనుష, గణేష్, వెంకటేష్‌తో పాటు రైతులు సత్యం, వెంకన్న, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నున్న నారాయణ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తాను బతికున్నంత కాలం పేదల కోసం ఉద్యమించిన నున్న నారాయణ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నున్నా నారాయణ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వెన్నారం కాల్వ నిర్మాణాలను పూర్తి చేసి తద్వారా వ్యవసాయానికి సాగు నీరందించాలని రైతులను సమీకరించి పోరాటాలు చేసి సాధించిన ప్రజానాయకుడు నున్నా నారాయణ అని కొనియాడారు. అగ్రకులంలో జన్మించినప్పటికి పేదల పక్షాన పోరాడారని చెప్పారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న, సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, అల్వాల వీరన్న, కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి, సీతారాం నాయక్, రాజు, హేమా, నాగన్న, వెంకన్న, ఉస్మాన్ పాల్గొన్నారు.



నున్న నారాయణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

● ప్రజానాట్యమండలి (పీఎన్‌ఎం) ఆధ్వర్యంలో నున్నా నారాయణ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నక్క సైదులు, నూనె శ్రీనివాస్, అచ్చ నాగేష్, మచ్చ వెంకన్న, మహంకాళి రాజు, వెంకన్న, హరిత, శ్రీనివాస్, మల్లేష్, ఎల్లమ్మ, భాగ్యలక్ష్మి, కమల, భద్రమ్మ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

● గౌతమి కళాశాల డైరెక్టర్ సంధ్యారాణి



విద్యార్థికి నగదు అందజేసి సన్మానిస్తున్న కళాశాల డైరెక్టర్ సంధ్యారాణి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ , అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గౌతమి జూనియర్ కళాశాల డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక కళాశాలలో శనివారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూఉన్నత విద్యనభ్యసించడానికి ఇంటర్మీడియట్ కీలక దశ అని, అధ్యాపకులు చెప్పే ప్రతీ పాఠ్యాంశాన్ని ఎప్పటికప్పుడు చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. గత విద్యాసంవత్సరం ఇంటర్ ఫలితాల్లో 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం సాధించిన విద్యార్థినీ ఎస్.వర్షిణికి రూ. 5వేల నగదు అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ్మగాని అరుణ్‌కుమార్, అధ్యాపకులు భాస్కర్, రవి, శేఖర్, రఘు, సంపత్, సరిత, శ్రీరాం పాల్గొన్నారు.



మహబూబాబాద్ తహసీల్ ఆఫీస్ ఎదుట సభలో అభివాదం చేస్తున్న సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ నేతలు

సకలం బంద్

(5వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, ఎమ్డీ. ఫరీద్, షేక్, మహబూబ్ పాష, ఆసిఫ్‌ఫకీర్, ఇస్మాయిల్‌నాయక్, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎమ్డీ. యూసూఫ్, నయీమ్, సాజిద్, ఫజల్, అక్రమ్‌అలీ, జాకీర్, షఫీ, ఖాజా, ఆరీఫ్, ఫయాజ్, శంషుద్దీన్, సిరాజ్, షారూఖ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

● బీసీల బంద్‌కు మద్దతుగా టీపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఘనపురం భిక్షపతి, సరెడ్డి రామలింగారెడ్డి, కోట్యానాయక్, సోమయ్య, రమ, మాధవి, అనీస్, ఫాతిమా, ఎం.ప్రసాద్, వినీల, ప్రియదర్శిని, తిరుమలయ్య, వెంకటేశ్వర్లు, సునిత, కె.శ్రీనివాస్, నాగరాజు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని టీడీపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య డిమాండ్ చేశారు. బీసీల బంద్‌కు మద్దతు ప్రకటించారు.

● తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు, బీసీ బంద్‌కు మద్దతుగా వివిధ కార్యాలయాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు దొంతోజు ఓంకార్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, చంద్రశేఖర్, మహేష్, రజిత, విజయ్‌కుమార్, నాగరాజు, మహిపాల్ పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేతలు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. శనివారం గార్ల రైతు వేదిక కార్యాలయంలో లబ్ధిదారుకు, సీఎంఆర్ఎఫ్ 60, కల్యాణలక్ష్మి 89 చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రజలు అభివృద్ధి చెందాలన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు సబ్సిడీపై ఎరువులు, ఖరీఫ్ పంట రుణాలు, రైతు రుణమాఫీ, రైతు బంధు, పేదలకు సన్న బియ్యం లాంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిందన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కోరం కనకయ్య

విద్యార్థులు క్రీడా రంగాల్లో రాణించాలి

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువులతో పాటు క్రీడారంగాల్లో రాణించి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరం కనకయ్య పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మహబూబాబాద్, గార్ల, బయ్యారం మండలాల జోన్‌స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, ఎంపీడీవో మంగమ్మ, తహసీల్దార్ శారద, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కట్టా శ్రీనివాస్‌రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, పాల్తీయా కిషన్‌నాయక్, మన్నేపల్లి వెంకయ్య, లింగాల నాగేశ్వరరావు, అందనాల రాజీవ్‌నాయుడు, యాకుబ్‌పాష, బాబులాల్ నాయక్, కోలా కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ధన్వంతరి పరివార్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

పాలకుర్తి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి పరివార్ జయంతి వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు గ్లాపల్లి సోమశేఖర్ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల ఆరాధ్య దైవం ధన్వంతరి పరివార్ అన్ని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు డీ.వీ.ఆర్ శర్మ, వెంకటయ్య, ముక్కెర సోమయ్య, జంపాల కృష్ణమూర్తి, రాజు, గణేష్, పగిడిపాల సోమనారాయణ, అశోక్, మద్దికుంట్ల నర్సయ్య, వెంకటేశ్ ఉన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాధ్యులు

ప్రేమ విఫలమై.. గడ్డిమందు తాగిన యువకుడు

(5వ పేజీ తరువాయి)

తరలించారు. చికిత్సపొందుతూ తొర్రూరులో రాజు మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. తమ కుమారుని మృతికి ఎవరూ కారణం కాదని తండ్రి కొమురమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన చోటు చేసుకున్న ప్రాంతం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో కేసును అక్కడికి బదిలీ చేయనున్నట్లు ఎస్ఐ వివరించారు.